www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 10 జనవరి 2025
5
వైఎస్ఆర్

## డిఇఒను సస్పెండ్ చేయాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

డిఇఒ మీనాక్షిని వెంటనే విధుల నుంచి తొలగించేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. అనంతరం పిడిఎస్‌యు నాయకులు మాట్లాడుతూ డిఇఒ మీనాక్షి వ్యవహార శైలిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. డిఇఒ ఏ పాఠశాలకు వెళ్లినా ఉపాధ్యాయులను అవహేళన చేస్తూ, అగౌరవ పరుస్తూ మాట్లాడడం సరైంది కాదన్నారు. ఆమెను ఇలానే కొనసాగిస్తే రానున్న పదో తరగతి పరీక్షల ప్రభావం విద్యార్థులపై పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, నగర నాయకులు శామీర్, షంషేర్, హర్షవర్ధన్, సుదర్శన్, శివప్రసాద్, జగదీశ్వర్ రెడ్డి, ప్రవీణ్, శివ మోహన్ పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులకు

# ఎంటిఎస్ విధానం అమలు చేయాలి

**- యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య డిమాండ్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఆప్కాస్ ఉద్యోగులకు ఎంటిఎస్ విధానం అమలు చేయాలని ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదుట ఆప్కాస్ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 1994 నుంచి అవుట్ సోర్సింగ్, తర్వాత ఆప్కాస్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. టిడిపి, వైసిపి అధికారంలోకి వస్తే ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పడమే తప్ప ఇంతవరకు చేసిన పాపాన పోలేదని చెప్పారు. గత ప్రభుత్వం అబద్ధాలు చెప్పి అవుట్ సోర్సింగ్ కార్మికులను మోసం చేసి ఆప్కాస్ విధానంలోకి మార్పు చేసిందే తప్ప వారికి ఏమాత్రం మేలు చేయలేదని విమర్శించారు. మేలు జరగకపోగా కీడు ఎక్కువే చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పిఆర్‌సి పెరిగే సమయంలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు 75, 80 శాతం వేతనాలు పెరిగేవని చెప్పారు. గత ప్రభుత్వం పుణ్యమా అని 23శాతం మాత్రమే వేతనాలు పెరిగాయని చెప్పారు. ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగాలంటే, ఆప్కాస్ కార్మికులకు లబ్ధి చేకూరాలంటే ఎంటిఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. గతంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు పెద్ద వ్యత్యాసం ఉండేది కాదని పేర్కొన్నారు. వందల్లో మాత్రమే వ్యత్యాసం ఉండేదని, ఇప్పుడు చూస్తే వేళల్లో వ్యత్యాసం ఉందని తెలిపారు. ఆప్కాస్ కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి వారిని సర్వీసును బట్టి పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిజిహెచ్ ఆప్కాస్ యూనియన్ కోశాధికారి బాలాజీ రావు, ఉపాధ్యక్షులు భాస్కర్, ఏసన్న, కార్యదర్శులు కొండయ్య, చెన్నయ్య, కమిటీ సభ్యులు జయసుధ, మరియమ్మ, ఆప్కాస్ కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య

# కర్నూలుపై కడప జట్టు విజయం

**ప్రజాశక్తి - కడప**

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అండర్ -12 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో కర్నూలు జట్టుపై ఆరు వికెట్ల తేడాతో కడప జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 34.3 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రిషిత్ 48, రేవంత్ 25 పరుగులు చేశారు. కడప జట్టులోని రుత్విక్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 140 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కడప జట్టు 26.3 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కడప జట్టులోని తాహిర్ 57 (నాటౌట్) పరుగులు చేశారు.

**నెల్లూరుపై అనంతపురం జట్టు విజయం**

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 75 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 35.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఆ జట్టులోని హవిష్ 51, గణేష్ 45 పరుగులు చేశారు. అనంతరం 196 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో 120 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. అనంతపురం జట్టులోని ఉత్తేజ్ యాదవ్ 5 వికెట్లు తీసుకున్నాడు.

తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

గండికోట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

## గండికోటలో సినీ స్టూడియో నిర్మించాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన గండికోటలో సినిమా స్టూడియో నిర్మించాలని, దీనివల్ల రాయలసీమ ప్రాంతం ఆర్థికంగా కొద్దిమేర పుంజుకోగలదని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. గండికోట ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గురువారం స్థానిక పివి ఆర్ గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, ఇంటాక్, పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి-కంచమ్మ, సరస్వతమ్మ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో గండికోట ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటలోని క్యానియన్ ఫొటోలను ఆవిష్కరించారు. అనంతరం బ్రహ్మయ్య మాట్లాడుతూ గండికోటలో సినీ స్టూడియో నిర్మించేందుకు ఇది అనువైన సమయమని, ప్రస్తుత ప్రభుత్వంలో సినీ ప్రముఖులు, పెద్దలు ఆ రంగంలో విశేషమైన అనుభవం ఉన్న వారు ఉన్నారని పేర్కొన్నారు. పిపిపి పద్ధతిలో వారి మార్గదర్శకత్వాన స్టూడియో నిర్మించాలని కోరారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ గండికోట ప్రాముఖ్యతను, ముఖ్యంగా క్యానియన్ విశిష్ఠతను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గండికోటకు యునెస్కో గుర్తింపు తెచ్చేందుకు పర్యాటక ప్రియులంతా కృషి చేయాలన్నారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ గండికోట ద్వారా జిల్లాకు మరిన్ని కీర్తి ప్రతిష్ఠలు రాగలవన్నారు. కార్యక్రమంలో లయన్ జోజిరెడ్డి, కేవీ రమణారెడ్డి, రాఘవేంద్రవర్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలకు అరుదైన గుర్తింపు

**ప్రజాశక్తి - కడప సిటీ**

గవర్నమెంట్ మెడికల్ కళాశాల కడప మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ న్యూఢిల్లీ నుంచి గుర్తింపు పత్రాన్ని పొందింది. దీనివల్ల అకాడమిక్ రీసెర్చ్ ఆక్టివిటీస్, మరింతగా అభివృద్ధి చెందుతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఎథికల్ కమిటీ రిజిస్ట్రేషన్ అనేది చాలా కొద్ది కళాశాలలకు మాత్రమే లభించే అరుదైన గుర్తింపు అన్నారు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఈ ప్రయోజనాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు కమిటీకి అధ్యక్షులుగా జనరల్ సర్జన్ డాక్టర్ గిరిధర్, కార్యదర్శిగా అనస్తీసియా విభాగాధిపతి డాక్టర్ సునీల్ వ్యవహరిస్తారన్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు కృషిచేసిన అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డిని ఆమె అభినందించారు.

వైస్ ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఎ. సురేఖ

క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు

## చెస్ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

**ప్రజాశక్తి - కడప**

చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఈనెల6, 7, 8 తేదీల్లో నిర్వహించిన 'చెన్నై ఇంటర్నేషనల్ క్లాసికల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్' లో కడప జిల్లాకు చెందిన చెస్ ఆటగాళ్లు అద్భుతమైన ప్రతిభ కనబరచి పతకాలను గెలుచుకున్నారు.**బాలికల విభాగంలో..** అండర్ -15లో తేజోమయి రెండవ స్థానాన్ని సాధించింది. అండర్ -9 కేటగిరీ లో ఆమీనా మూడవ స్థానాన్ని గెలుచుకుంది. అండర్ -13లో లాస్య శ్రీ నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకుంది. అండర్ -11 కేటగిరీ లో దీపిక ఎనిమిదవ స్థానాన్ని సాధించింది. **బాలుర విభాగంలో ..** అనురాగ్ రేటెడ్ ప్లేయర్లపై రెండు గేమ్‌లో విజయవంతంగా గెలిచాడు. ఒక గేమ్ డ్రా చేశాడు, అలాగే రేటింగ్ లేని ప్లేయర్లపై ఒక గేమ్ గెలిచాడు. ప్రేమ్ దీప్ 1.5 పాయింట్లను సాధించాడు. ఈ విజయాలను పురస్కరిం చుకొని వైఎస్ఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి మాట్లాడుతూ "కడప జిల్లాకు చెందిన యువ చెస్ ఆట గాళ్లు తమ ప్రతిభను చాటుతూ జిల్లాను గర్వపడేలా చేశారు అని అన్నారు. వైఎస్ఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ తరపున విజేతలకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## జింక రవీంద్ర బాబుకు డాక్టరేట్

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** వైవీయూ క్యాంపస్ పీజీ కళాశాల రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ జింక రవీంద్ర బాబుకు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎజి దాము పర్యవేక్షణలో 'బయో గైడెడ్ ఐసోలేషన్ అండ్ సెమీ సింథసిస్ ఆఫ్ మల్టీ ఫంక్షనల్ ఫైటో కన్స్టిట్యూయన్స్‌ఇమ్ప్లికేషన్ ఫర్ అల్జీమర్స్ డిసీస్ అండ్ డయాబెటిస్ డ్యూయల్ థెరపీ' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వైవీయూకు సమర్పించారు. నిపుణుల బృందం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో రవీంద్రకు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు డాక్టరేట్ ప్రకటించారు.

## అమిత్‌షా రాజీనామా చేయాలి

**ప్రజాశక్తి - కడప :** కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి తన మంత్రి పదవికి తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ బండి జకరయ్య డిమాండ్ చేశారు. గురువారం కడప నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి జకరయ్య మాట్లాడుతూ రాజ్యాంగ శిల్పి అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన సిగ్గుమాలిన వ్యాఖ్యలపై యావత్ భారతదేశం రగిలిపోతుందన్నారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నరసింహులు, అబ్దుల్ సత్తార్, మల్లెం విజయభాస్కర్, సంజయ్ కాంత, కుళ్లాయప్ప, సునీల్, శ్యామలమ్మ, నాగరత్నగౌడ్, ఏకాదశి భువన్ రెడ్డి, సిరాజుద్దీన్, హరిప్రసాద్, దస్తగిరి పాల్గొన్నారు. **పోరుమామిళ్ల (కాశినాయన):** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌ఛార్జి, పిసిసి సభ్యులు అన్వర్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బద్వేల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఎన్.డి విజయ జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని హోం మంత్రి అమీషాకు రాసిన లేఖను అంబేద్కర్ పాదాల వద్ద ఉంచి నిరసన తెలియజేశారు.కార్యక్రమంలో, కాంగ్రెస్ కార్యకర్తలు ముజాహిద్, ఫయాజ్ , రామ్మూర్తి ,శీను, బాషా పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# పరిశ్రమలతోనే జిల్లా ఆర్థిక ప్రగతి

**- డిఐఇపిసి సమీక్ష సమావేశంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కొప్పర్తి పారిశ్రామిక వాడలోని డిక్సన్ ఇండస్ట్రీ మీటింగ్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అన్నారు. పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొం దించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రియల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు కూడా సహకరించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల ప్రమోషన్‌కు సంబంధించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో మౌలిక వసతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశ్రామికవేత్తలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. పారిశ్రామిక వాడలో భద్రత కోసం భద్రతా ఏజెన్సీతో మాట్లాడుకుని ఆయా పరిశ్రమల సమన్వయ సహకారంతో 24 గంటల భద్రతా సౌకర్యాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. అంతకుముందు కొప్పర్తి పారిశ్రామిక వాడలోని అన్ని క్లస్టర్ల నిర్వహణలో, ఏర్పాటు కానున్న వివిధ పరిశ్రమల యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా అధునాతన వసతులతో నిర్మించిన ఇండస్ట్రియల్ గెస్ట్ హౌస్‌ను, అక్కడి వసతులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సమావేశంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, డిఆర్ డిఎ పిడి ఆనంద్ నాయక్, ఐపిఒ ఎల్‌డిఎం జనార్దనం, డిటిసి డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణ మూర్తి, ఎపిఐఐసి ప్రతినిధులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక డిడిఆర్‌ఎఫ్ అధికారులు, డిటిఒ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఎపిఎస్ పిడిసిఎల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

**పశువుల అక్రమ తరలింపు నేరం**

ఎవరైనా పశువులను హింసించినా, బహిరంగ ప్రదేశంలో వధించినా, అక్రమంగా తరలించినా అండర్ సెక్షన్ 38/1978, సెక్షన్ 59/1960 ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేటులోని బోర్డు మీటింగ్ హాలులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలోనూ ప్రివెంటేషన్ ఆఫ్ క్రూసిల్టి టు అనిమల్స్ యొక్క సొసైటీని ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారని అన్నారు. కడప జిల్లాలో 2017 సంవత్సరంలో సొసైటీని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, డిఇఒ మీనాక్షి, అధికారులు, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.

**మాతృ మరణాలు ఉండకూడదు : కలెక్టర్**

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మాతృ మరణాలు ఉండకూడదని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన హాలులో చెన్నూరు, కొండాపురం, టేకురుపేట, వికలాంగుల కాలనీ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన మాతృ మరణాలపై సమీక్షించారు. మాతృ మరణాలకు కారణాలను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, ఉన్నత ఆసుపత్రుల స్పెషలిస్ట్ వైద్యులు, ప్రయివేట్ ఆసుపత్రుల వైద్యులతో చర్చించారు. ఆయా ఆసుపత్రుల్లో అందించిన సేవలు గురించి అడిగారు. డిసిహెచ్ఎస్ సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి జరుగుతున్న రెఫరల్ కేసుల గురించి విచారణ చేయాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవి

'బ్లూబెల్స్' యాజమాన్యంపై

## చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి- కడప అర్బన్**

కడప నగరంలోని రవీంద్రనగర్‌లో ఉన్న బ్లూ బెల్స్ విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులతో పాఠశాల పక్కన ఉన్న భవన నిర్మాణానికి సంబంధించి విద్యార్థులతో కంకర, ఇసుక మోపిస్తూ వారితో గొడ్డు చాకిరి చేయిస్తున్నారని, వెంటనే పాఠశాల యాజమాన్యం పై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు చదువులు అభ్యసించే విధంగా లేకుండా వారికి భవిష్యత్తులో చదువుకు దూరం చేసే విధంగా గొడ్డు చాకిరి పని చేయించుకోవడం దుర్మార్గమని అన్నారు. ఈ విధంగానే ఉంటే రాబోవు రోజుల్లో విద్యను అభ్యసించడానికి విద్యార్థులు దూరమవుతారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్, నాయకులు రఘు పాల్గొన్నారు.

## శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మైనారిటీలను సీడప్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తోందని, మైనార్టీ, దూదేకులు దరఖాస్తు చేసుకోవాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. గురువారం పాత బస్టాండ్ సమీపంలోని మన్సూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో యువత నిరుద్యోగ సమస్య, పేదరికంతో ఉన్న కారణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశలు కల్పించి వారి కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చెందే విదంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మైనారిటీ యువతీ, యువకులు సీడప్ ద్వారా దరఖాస్తు చేసుకుని రాష్ట్రంలోని ఆయా జిల్లాలోని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ, రాష్ట్ర కార్యాలయానికి దరఖాస్తూ పంపాలని, వారి శిక్షణ పూర్తి అయిన తరువాత, అర్హత కల్గిన వారికి బహుళ జాతీయ కంపెనీలలో ఉద్యోగ అవకాశం ఉంటుందని చెప్పారు. నూరబాష్ దూదేకుల ముస్లిమ్స్ కార్పొరేషన్ ద్వారా దూదేకుల యువతీ యువకులు దరఖాస్తు చేసుకుని అభివృద్ధి కావాలన్నారు. మిగితా సమాచారం కోసం కార్పొరేషన్ ఎం.డి గౌస్ పీర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**ప్రజాశక్తి - వల్లూరు**

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ఆడాలని, అప్పుడే విజయం సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో యువ నాయకుడు పుత్త సాయి నరసింహ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు లేబాక నాగేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రామకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు వెంకటసుబ్బారెడ్డి, సుధాకర్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, ప్రతాప్ రెడ్డి, సుబ్బరాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

## మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

**ప్రజాశక్తి - కడప**

వైకుంఠ ఏకాదశి టోకెన్లు జారీలో భక్తుల మృతి తీవ్ర విచారకరమని, మృతుల కుటుంబాలకు రూ. కోటి, గాయపడిన వారికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా టిటిడి మాజీ సభ్యులు మాసీమ బాబు, యానాదయ్య పేర్కొన్నారు. వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తొక్కిసలాటలో ఆరుగురు మృతిచెందడం, వందలాది మంది గాయాలపాలు కావడం బాధాకరమని పేర్కొన్నారు. తిరుమల చరిత్రలో ఇంతటి అపచారం ఎప్పుడు జరగలేదని అన్నారు. పాలక మండలి చేతగాని నిర్ణయాల వల్లే ఈ దారుణం జరిగిందని అన్నారు. దీనికి కారణమైన టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి బాధ్యత వహించాలని తెలిపారు. టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు ఆ స్థానానికి అనర్హుడు అని అన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న మెడికల్ ఆఫీసర్

## హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి

**ప్రజాశక్తి - గోపవరం**

హై రిస్క్ గర్భిణులను గుర్తించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె. వినయ్‌కుమార్ పేర్కొన్నారు. బద్వేల్ మండలంలోని తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ అభయాన్ సురక్షిత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గర్భిణులందరికీ సరైన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించాలని సూచించారు. 102,108 వాహనాలను హైరిస్క్ గర్భిణులున్న ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది గీత, ఎఎన్ఎం, ఆశా కార్యకర్త బాలరాణి, రాజమ్మ గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ విశ్వంత, హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ కె. వెంకటమ్మ, విలేజీ హెల్త్ క్లినిక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిసిఆర్‌సి కార్డుదారులకు పంట రుణాలు

**ప్రజాశక్తి - కడప :** జిల్లాలో సిసిఆర్‌సి కార్డులు ఉన్న కౌలు రైతులు పంట రుణాలు తీసుకోవచ్చునని జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు తమ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి రుణాలు పొందవ చ్చునని పేర్కొన్నారు. రుణాల మంజూరుకు సంబంధించి జిల్లాలోని అన్ని బ్యా ంకులకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. కౌలు రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే 08562-242397లో సంప్రదించాలని తెలిపారు. సంబంధిత పొలంపై భూమి యజమానులు పంట రుణం తీసుకోకుండా ఉంటేనే కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు ఇస్తాయని పేర్కొన్నారు.

## శాశ్వత సభ్యత్వం స్వీకరణ

**ప్రజాశక్తి-అట్లూరు**

బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త యువ నాయకుడు రితీష్ రెడ్డి సమక్షంలో పలువురు శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం అభిమానులు నియోజవర్గ సమన్వయకర్త రితీష్ రెడ్డి, మంచూరు సూర్యనారాయణ రెడ్డిని అభినందించారు. టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని రితీష్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడు సూర్యనారాయణ రెడ్డి, అట్లూరు మండల సీనియర్ నాయకులు నందగోపాల్ రెడ్డి,అట్లూరు మండల క్రియాశీ నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు ఉంచడానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్ రెడ్డి చేస్తున్న కృషి అమోఘం అన్నారు.

సభ్యత్వం తీసుకుంటున్న నాయకులు

ఇఒకు వెండిశంఖుచక్రాలను అందజేస్తున్న దాతలు శ్రీనివాసులు, ఈశ్వరమ్మ

## వెండి శంఖుచక్రాలు వితరణ

**ప్రజాశక్తి - వేంపల్లె**

స్థానిక వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెండిశంఖు చక్రాలను దాతలు అందజేశారు. గురువారం వేంపల్లెలోని పుల్లయ్య తోటకు చెందిన నాగన్న కుమారుడు నంది బత్తిని శ్రీనివాసులు, ఈశ్వరమ్మ అనే దంపతులు కిలో 474 గ్రాములు బరువు ఉన్న వెండి శంఖులను ఆలయ ఇఒవిశ్వనాథ్‌రెడ్డికి అందజేశారు. ఇఒఆలయం తరుపున ప్రత్యేక పూజలు చేసి దాతలను సత్కరించారు. మాజీ పాలక మండలి సభ్యుడు పివి రమణ, అర్చకుడు అచ్యుత్ కుమార్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

మిషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సూచించారు. గురువారం కమిషనర్ మున్సిపల్ అధికారులతో కలిసి పురపాలకలోని కదిరి రోడ్‌లో ఉన్న కంపోస్టు యార్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న చెత్త వేరు చేయు మిషన్‌ను ఆయన పరిశీలించారు. మిషన్‌లో సాంకేతిక సమస్యలు రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పురపాలక ప్రజలు కూడా తడిపొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, ప్రతిరోజు చెత్త వాహనాలు మీ ఇంటి ముందుకే వస్తున్నాయని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని కోరారు.

## అమిత్‌షా హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలి

**- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పులివెందుల అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయ కర్త ధృవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి అమిత్ షాపై పోరాటం చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం అన్నారు. 25 విభాగాలు, 12 షెడ్యూలు, 448 అధికరణలతో కూడిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగమని కొనియాడారు. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, బద్రీనాథ్, ఉత్తన్న, వేమయ్య, వెంకటేష్, మహబూబ్ బాషా, నాగరాజు, మదార్, సాయి, వినయ్, వెంకట్, తేజ పాల్గొన్నారు.

**టిటిడి దుర్ఘటన అత్యంత విషాదకరం**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకన్లు ఇచ్చే సందర్భంలో జరిగిన తొక్కిసలాటలో తిరుపతి బైరాగి పట్టెడు కేంద్రం వద్ద జరిగిన దుర్ఘటన అత్యంత విషాదకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి తులసిరెడ్డి టిటిడి ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొక్కిసలాటలో 6 మంది చనిపోవడం, అందులో అయిదు మంది మహిళలు కావడం బాధాకరమన్నారు. జనవరి 8వ తేదీ టిటిడి చరిత్రలో ఓ చీకటి రోజన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, బద్రి, వేమయ్య, నాగరాజు, వెంకటేష్, మహబూబ్ బాషా, మదార్, వినయ్, సాయి, వెంకట్, తేజ, హేమంత్ పాల్గొన్నారు.

## ఢిల్లీ పీఠంపై బాబు కలలు కనడం అవివేకం

**వేంపల్లె :** ఢిల్లీ పీఠం ఎన్‌డిఎ ప్రభుత్వం కైవసం చేసుకొంటుందని బాబు కలల కనడం ఆయన అవివేకానికి నిదర్శనమని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డి నేటర్ రహంతుల్లా, జిల్లా కో-కన్వీనర్ దాదాపీర్ పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నం బహిరంగ సభలో ప్రధాని మోడీ ముందు సిఎం చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఢిల్లీ పీఠం ఎన్‌డిఎ కైవసం చేసుకొంటుందని చెప్పడం గమనార్హమన్నారు. మోడీని నమ్మించేందుకు బాబు సాధ్యం కాని ప్రసంగం చేశారని తెలిపారు. గత ప్రభుత్వం అసమర్థత వల్లే ఎపి ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారనే విషయాన్ని చంద్రబాబు గ్రహించాలని కోరారు. ఎన్‌డిఎ కూటమి నాయకులంతా వచ్చినా ఢిల్లీ పీఠం మాత్రం ఆమ్‌ఆద్మీ పార్టీనే కైవసం చేసుకొంటుందని వివరించారు.

## రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

మాట్లాడుతున్న సిఐ లింగప్ప

రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలను నివారించాలని అర్బన్ సిఐ లింగప్ప సూచించారు. గురువారం స్థానిక బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ నుంచి విద్యార్థులతో రోడ్డు భద్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ లింగప్ప మాట్లాడుతూ విద్యార్థులచే పురప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించినందుకు యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినం దిస్తున్నామన్నారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనం తరం డైరెక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడారు. మధ్యాహ్నం నుంచి బాలాజీ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు భోగి మంటలు, ముగ్గులు వేశారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు కోలాటం వేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, బాలాజీ హైస్కూల్ ఎఒ ప్రసాద్‌రెడ్డి, సోషల్ టీచర్ షబానా, ప్రసాద్, నాగేశ్వరరెడ్డి, సత్యానందం, పుల్లయ్య, బాలు, ముని, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**ప్రజాశక్తి - చాపాడు**

మండల కేంద్రంలోని గాయత్రి పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు శివశంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను నేటితరం యువత మరిచిపోకుండా ఉండేందుకు పండుగల ప్రాధాన్యత వివరిస్తున్నామన్నారు. భోగి మంటలు, రంగుల ముగ్గులు, పిండి వంటకాలు విద్యార్థులతో చేయించి పండుగ వాతావరణాన్ని కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరామ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**శ్రీషిర్డీసాయి డిగ్రీ కళాశాలలో..**

**జమ్మలమడుగు రూరల్ :** ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించామని శ్రీషిర్డీసాయి డిగ్రీ కళాశాల డైరెక్టర్ క్రరు సంజీవరెడ్డి, ప్రిన్సిపల్ సుధ తెలిపారు. గురువారం ఉదయం విద్యార్థులు పోటీలో పాల్గొని బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న కళ, సృజనాత్మకను వెలికితీయడానికి ఈ పోటీలు నిర్వహించామన్నారు. మొదటి బహుమతి వెన్నెల, సుమలత, రెండవ బహుమతి సుజాత, గంగారత్న గెలుచుకున్నారన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ద్వారకానాథ్‌రెడ్డి, అధ్యాపకులు కిషోర్, వెంకటస్వామి, విద్యార్థినులు పాల్గొన్నారు.

**ముచ్చుమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో..**

**కొండాపురం :** మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు ముగ్గుల పోటీలు నిర్వహించి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి, డిటి మీనా పాల్గొన్నారు. ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

**శ్రీ చైతన్య పాఠశాలలో..**

**వేంపల్లె :** శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు భోగి మంటలు వేసి విద్యార్థులు సందడి చేశారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి నృత్య ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, శ్రీచైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వివేకానంద పాఠశాలలో..**

**చాపాడు :** మండల పరిధిలోని చిన్న గురువలూరు గ్రామంలో ఉన్న శ్రీస్వామి వివేకానంద పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయానికి సంక్రాంతి పండుగ నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నారాయణ పాఠశాలలో..**

**పులివెందుల టౌన్ :** ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. గురువారం పట్టణంలోని స్థానిక నారాయణ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలు జి.మనస్విని, యూహిత రెడ్డి, వి.ప్రజ్వలా రెడ్డి, సి.ఊర్వికి బహుమతులు అందజేశారు. అనంతరం చిన్నారులకు భోగి పళ్ళుపోసి ఆశీర్వదించారు. ముఖ్య అతిథిగా ఎజిఎం కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరితరెడ్డి, అకాడమిక్ డీన్ భాస్కర్, ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపల్ అంజనాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**వికాస్ పాఠశాలలో..**

**పులివెందుల రూరల్**

స్థానిక కదిరి రోడ్డు సమీపంలో ఉన్న వికాస్ హైస్కూల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా రంగురంగుల ముగ్గులతో తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రవి కుమార్‌రెడ్డి విద్యార్థుల కళా నైపుణ్యాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్ర మాలు వారి సాంస్కృతిక అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

కడప గురుకుల్ విద్యా పీఠ్‌లో..

కడప సాయిబాబా హైస్కూల్‌లో..

పోరుమామిళ్ల వెంగమాంబ పాఠశాలలో..

# మైదుకూరుకే తలమానికం 'ఇంద్రప్రస్థ'

## డిటిసిపి అనుమతి ఉన్న విల్లా ప్లాట్‌గేటెడ్ కమ్యూనిటీ ఇంద్రప్రస్థ -12న వెంచర్ ప్రారంభ ఏర్పాట్లు

వెంచర్ ముఖద్వారం

ఎండి పివి నారాయణ యాదవ్

**ప్రజాశక్తి - మైదుకూరు**

మైదుకూరులో మొదటి డిటిసిపి అనుమతి కలిగిన విల్లా-ప్లాట్ గెటెడ్ కమ్యూనిటీ వెంచర్ ఇంద్రప్రస్థ ఈనెల 12న ప్రారంభించనున్నట్లు ఎంఎల్ఎన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ డైరెక్టర్ పివి నారాయణ యాదవ్ తెలిపారు. మైదుకూరు పట్టణానికే తలమానికంగా కడప-కర్నూలు నేషనల్ హైవేలో కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ డిటిసిపి మున్సిపాలిటీ అనుమతులు పొందిన గేటెడ్ కమ్యూనిటీ ఇంద్రప్రస్థ అని తెలిపారు. 22.10 ఎకరాల్లో సువిశాలమైన స్థలంలో పార్క్, సోలార్ ఫినిషింగ్, ఎలక్ట్రిసిటీ అండర్ గ్రౌండ్ డ్రయినేజీతో వెంచర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఇంటికి నీటి సరఫరా, మెజిస్టిక్ ఎంట్రెన్స్ ఆర్చి, 40 అడుగుల సిమెంట్ రోడ్లు, విద్యుత్ దీపాలు, ట్రాన్స్‌ఫార్మర్ యాడ్ అందుబాటులో ఉన్నాయన్నారు. డంప్ యార్డు, ఓవర్ హెడ్ ట్యాంక్, ప్రత్యేక రకాల మొక్కలు, చిన్న పిల్లలు ఆడుకునే పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వెంచర్‌ను ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేతులమీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. దీంతోపాటు క్యాలెండర్ ఆవిష్క రణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, విందు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తమ కస్టమర్లు, శ్రేయోభిలాషులు, మార్కెట్ సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

## 'వరద'కు కప్పం కడితేనే వ్యాపారాలు

**- వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి**

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ముందుగా ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి, తర్వాత ఎన్. కొండారెడ్డి అనుమతి లేనిదే వ్యాపారాలకు అనుమతి ఉండదని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. తన స్వగృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారికి కప్పం కట్టి వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తండ్రీకొడుకుల అక్రమార్జనకు అధికారులు కూడా వత్తాసు పలకడం అన్యాయమన్నారు. వచ్చే నాలుగేళ్ల పూర్తి అయ్యేలోగా రూ.2000కోట్లు సంపాదించాలనే ధ్యేయంగా వరద తనయుడు కొండారెడ్డి ఉన్నాడని రాచమల్లు అన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి ప్రతీక

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

చదువుతోపాటు పోటీ ప్రపంచంలో క్రీడలు చాలా ముఖ్యమని, అవి మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని ఎంఇఒ రమణారెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పట్టణంలో నెహ్రూ యువ కేంద్రం సారథ్యంలో సురేంద్ర చారిటబుల్ ట్రస్ట్ యువ బ్లడ్ డోనార్స్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పతంగి రామన్న ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీలు నిర్వహించామని సురేంద్ర, ప్రసాద్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థుల టీంకు ( దేవగుడి జడ్పీ హైస్కూల్ )విన్నర్‌కు బహుమతి రూ.5000, (పిఆర్ హైస్కూల్) రన్నర్స్‌కు రూ.3000 ప్రైజ్ మనీ, మెడల్స్, తృతీయ స్థానం సాధించిన( విశ్వజ్యోతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ) జట్టుకు మెమెంటో ఇచ్చారు. కార్యక్రమానికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, పీఈటీలు మురళి, సంజీవ పాల్గొన్నారు.

## నేడు బండలాగుడు పోటీలు

**- విజేత ఎడ్ల యజమానులకు బహుమతులు ప్రదానం**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణ పరిధిలోని ఉలిమెల్ల గ్రామంలో శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ ప్రజలు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉదయం 8 గంటలకు బండ లాగుడు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు బూచిపల్లి సీతారామ కోలాట బృందంచే ప్రదర్శన ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## రాజోలు ఆనకట్ట ఎత్తు పెంచేందుకు కృషి చేస్తా

**- కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి**

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

కెసి కెనాల్‌కు ముఖ్యమైన రాజోలు ఆనకట్ట ఎత్తు పెంచేందుకు, కెసి కెనాల్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు కెసి కెనాల్ బంగ్లా వద్ద గురువారం జరిగిన సమావేశంలో కెసి కెనాల్ ఆయకట్టు కింద రైతులకు మార్చి నెలాఖరు వరకు ఆరుతడి పంటలకు నీరు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ డి.గురువిరెడ్డి మాట్లాడుతూ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ రాజోలు ఆనకట్ట ఎత్తు పెంచాలని శాసనసభలో సైతం ప్రభుత్వాన్ని అడిగారన్నారు. కెసి కెనాల్ అభివృద్ధికి ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, వరదరాజులరెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు సంకల్ప దీక్షతో ఉన్నారన్నారు. కడప జిల్లాలో లస్కర్ల సమస్యను కర్నూలు జిల్లాలో ఉన్న లస్కర్లతో పూర్తి చేస్తామన్నారు. కెసి కెనాల్ బంగ్లాలను ఆధునికరిస్తామన్నారు. డిసిలు రాంపుల్లారెడ్డి, రెడ్యం రవీంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, డిఇ పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

## కెసి ఆయకట్టు పరిధిలో మరమ్మతులకు చర్యలు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

కెసి కెనాల్ ఆయకట్టు కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు చేపడతామని కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మీపేట గురివిరెడ్డి తెలిపారు. గురువారం కెసి కెనాల్ ఆయకట్టు చైర్మన్ రామలింగారెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రెడ్యం రవీంద్రారెడ్డి, మాజీ ఎంపిపి బొగ్గుల చంద్రఓబుల్‌రెడ్డి, చెన్నముక్కపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, త్రిపురవరం టిడిపి నాయకులు హరినాథ్‌రెడ్డి, చె ముళ్ళ పల్లె మాజీ సర్పంచ్ రెడ్యం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న డాక్టర్ మంగేశ్వరరావు

## కుప్పాలపల్లెలో లేగ దూడల ప్రదర్శన

**ప్రజాశక్తి - వేంపల్లె**

సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని కుప్పాలపల్లెలో గురువారం లేగ దూడల మహోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఎపి పశుసంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆ శాఖ అధికారులు చేపట్టారు. లేగ దూడల ప్రదర్శనను పులివెందుల ఉప సంచాలకులు డాక్టర్ మంగేశ్వరరావు ప్రారంభించారు. లేగ దూడల ప్రదర్శనలో 42 కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడలను రైతులు ప్రదర్శనలో పెట్టారు. ఆరోగ్యవంతంగా ఉండే లేగ దూడలను ఎంపిక చేసి వాటి యాజమానులకు బహుమతులను అందజేశారు. కడప డిఎల్‌డిఎ డాక్టర్ శివరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.1,350 ధర నిర్ణయించి లింగ నిర్ధారిత వీర్యం ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. పశువుల్లో వచ్చే గర్భకోశవ్యాధులు, దూడల పెంపకం, లింగనిర్ధారణ వీర్యం వల్ల వచ్చే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వేంపల్లె పశుసంవర్థక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాథ్‌రెడ్డి, డాక్టర్ సాదిక్ బాషా, డాక్టర్ బొజ్జ ఓబుల్‌రెడ్డి, ఎహెచ్ఎ వనజా, ఆ శాఖ సిబ్బంది, రైతులు, పాల్గొనారు.

రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

## గర్భిణులకు అన్నదానం

**ప్రజాశక్తి - కొండాపురం**

కొండాపురం ప్రభుత్వ వైద్యశాలలో గత ఏడాది కాలంగా ప్రతినెలా 'రెడ్డి వెల్ఫేర్ సొసైటీ' ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం తిమ్మాపురం గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఒంటెద్దు జగన్‌మోహన్ లింగారెడ్డి గారి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు రెడ్డి వెల్ఫేర్ సొసైటీ జాతీయ కన్వీనర్ ఒంటెద్దు రామలింగారెడ్డి గర్భిణులకు, ఆశా వర్కర్లకు, రోగులకు, ఆసుపత్రి సిబ్బందికి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమం రెడ్డి వెల్ఫేర్ సొసైటీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలమూరు జగన్ మోహన్‌రెడ్డి, డాక్టర్ సుజాత, డాక్టర్ సాంబ శివారెడ్డి, రెడ్డి వెల్ఫేర్ సొసైటీ నాయకులు డాక్టర్ మహాదేవరెడ్డి, గాజులపల్లి నారాయణరెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**తొండూరు :** తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేష్మా ఆధ్వర్యంలో 'ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు పలు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రక్త హీనత నివారణ, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యతను ఆరోగ్యవిద్య ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆరీపుల్లా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, హెల్త్ సూపర్వైజర్ శశికళ, స్టాఫ్ నర్సు అనూష, ఫార్మసీ ఆఫీసర్ ఓబులేసు, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, కమ్యూనిటీ హెల్త్ అధికారులు సోమేశ్వరి, సాయిదివ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంధుల ఆశ్రమంలో ..

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

స్థానిక శ్రీవీరనారాయణమ్మ అంధుల ఆశ్రమంలో గురువారం పట్టణంలోని చిన్నన్న రాముల వీధిలో ఉండే స్వర్ణకారుడు గొగ్గి కొండన్న ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి గొగ్గి నారాయణమ్మ, కుమారుడు రాము, కోడలు గంగాదేవి, మనవడు హర్షవర్ధన్, మనువరాలు తనూజ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధులకు అన్నదాన చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు.

# క్రైం కార్నర్

## భారీగా రేషన్ బియ్యం పట్టివేత

**- 183 బస్తాలు, ఐచర్ వాహనం స్వాధీనం**

**ప్రజాశక్తి - వేంపల్లె**

మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐలు నాయకుల నారాయణ, శివన్న పట్టుకున్నారు. గురువారం ఎన్ఫోర్స్మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు వారు ఎస్ఐ రంగారావు, డిటి సుధీర్‌తో కలిసి దాడులు నిర్వహించారు. అందిన సమాచారం మేరకు అక్రమంగా 183 రేషన్ బస్తాలను ఐచర్ వాహనంలో తీసుకెళ్తుండగా గుర్తించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం రేషన్ బియ్యాన్ని వేంపల్లిలోని పౌర సరఫరాల శాఖ గౌడన్‌కు తరలించామన్నారు. వేంపల్లె చుట్టూ ప్రాంతాల ప్రజల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. ఇవి అనంతపురం జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులుగా గుర్తించామన్నారు. కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హరినాథ్ రెడ్డి, ఆర్ఐ లోకేష్, విఆర్ఒలు ఓబయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## రిమాండ్‌కు నిందితులు తరలింపు

**ప్రజాశక్తి - వేముల**

మండలంలోని మబ్బుచింతలపల్లి సమీపంలోని నంది కాంట్రాక్టర్‌కు చెందిన చీనీ తోటలో గతనెల డిసెంబర్ 31న విశ్వజిత్ సాహు అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఆత్మహత్యపై తమకు పలు అనుమానాలు ఉన్నాయంటూ విశ్వజిత్ సాహు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ ప్రవీణ్‌కుమార్.. పది రోజులుగా నంది కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులను ఒక్కొక్కరిగా పిలిచి విచారించారు. తన తోటి పనిచేస్తున్న ప్రకాష్‌రెడ్డి, అబ్దుల్లా, కాంట్రాక్టర్ మహేశ్వర్‌రెడ్డి రెండురోజులు ముందుగా విశ్వజిత్ సాహును అవమానించి కొట్టడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని విచారణలో తేలడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. ఆ మేరకు పోలీసులు గురువారం పులివెందుల కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## బ్రహ్మసాగర్‌లో పడి వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

మండల కేంద్రంలోని బ్రహ్మసాగర్‌లో వీరపునాయనపల్లి మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన రామిరెడ్డి(78) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులకు గురువారం బ్రహ్మసాగర్‌లో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఎఎస్ఐ గుర్రప్ప సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. ఎఎస్ఐ వివరాల మేరకు.. తాను బ్రహ్మంగారి గుడికి వెళ్లి వస్తానని మంగళవారం కుమార్తెతో చెప్పి ఇంటి నుంచి వచ్చాడు. తన భార్య చనిపోయినప్పటి నుంచి రామిరెడ్డి మనశ్శాంతి కోసం గుడులకు వెళ్లే వాడని బంధువులు తెలిపారని ఎఎస్ఐ చెప్పారు. మృతుడు గండి, ఓబుళం, బ్రహ్మంగారిమఠం అప్పుడప్పుడూ వస్తూ ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION) PRODDATUR**
**I.A.No. 1208/2023**
**O.S.No. 76/2023**
Dr.T.Subba Reddy, S/o Late T.Subbi Reddy, R/o D.No. 82, Road No.2B, Singapore Township, Near RIMS, Kadapa City, YSR (Dt).
...Petitioner/Plaintiff
Vs
1. Thallapureddy Nadipi Subbi Reddy @ Chinna Subba Reddy & 5 Others.
...Respondents/Defendants
4 మరియు 5వ రెస్పాండెంట్స్‌కు నోటీసు
4. Thallapaureddy Surekha, D/o Late Sudhakar Reddy,
5. Thallapureddy Sunanda, D/o Late Sudhakar Reddy,
Both are residing at D.No.40/48, Muthurasipalli, Kadapa City, YSR (Dt).
...Respondents/Defendant No. 4&5
పై నెంబరు గల దావాలోని షెడ్యూలు ఆస్తులను విక్రయ లావాదేవీలు జరుపకుండా ఉండుట కొరకు పైన తెలిపిన I.A.No. 1208/2023 నెంబరు గల పిటిషన్‌ను పిటిషనరు దాఖలా చేసి వున్నారు. అట్టి పిటిషన్‌లో 4 మరియు 5 రెస్పాండెంట్లు అయిన మీరు నోటీసు తీసుకొనకుండా ఉండుట వలన ఈ ప్రకటన ద్వారా తెలియజేయడం ఏమనగా మీరు పై తెలిపిన రాజశ్రీ కోర్టులో 28.01.2025వ తేదీన ఉదయం గం॥10.30 ని॥లకు మీరు గానీ, మీ తరపున న్యాయవాది గారు గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు హాజరు కానంతట మీ పైన పరోక్షంగా తీర్మానించబడును.
వాయిదా తేది: 28.01.2025
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//
కె.వెంకట హరి
యం.వి.నరసయ్య
న్యాయవాదులు, ప్రొద్దుటూరు.

**in the Court of the Hon'ble Principal Junior Civil Judge, Kadiri**
**O.S.No.89/2020**
**Between:**
Pallu Gangi Reddy S/o late Pallu sidda Reddy, Pallavandlapalle H/o Bandlapalle, Nuthanakalva post, Talupula Mandalam. ...Plaintiff.
AND
1) Pallu Siva Reddy & others ...Defendants.
**Suit Summons by way of paper publication to D- 8 & D- 10**
To,
**D-8)** Pottipati Chandrasekhar Reddy Sto Pottipati Gangi Reddy.
**D-10)** Pottipati Lalitha D/o Pottipati Gangi Reddy, Both are r/at D. No.3/38, Sugali Bidiki H/o Maddimadugu, Lingareddipalle post, Chinthakommadinne Mandalam. YSR Kadapa District.
పై దావాలో 8,10 ప్రతివాదులకు ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా వాది దావా ఆస్తులు భాగపరిష్కార నిమిత్తము పై దావా దాఖలు చేసి వున్నాడు. ఇందులకు మీకు అభ్యంతరములు ఉన్న యెడల తేది:03/02/2025న ఉదయం 10:30 గం॥లకు ఖుద్దున కానీ, వకీలు ద్వారా గానీ ఘనమైన కోర్టు వారి ఎదుట హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల మీ పరోక్షమున దావా తీర్మానము చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:03/02/2025
స్థలం:కదిరి
బండారు క్రిష్ణమూర్తి, MA, LLB,
వాదిపరము న్యాయవాది, కదిరి.
సెల్:9618465758

**IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION) PRODDATUR**
**O.S.No. 76/2023**
Dr.T.Subba Reddy, S/o Late T.Subbi Reddy, R/o D.No. 82, Road No.2B, Singapore Township, Near RIMS, Kadapa City, YSR (Dt). ...Plaintiff
Vs
1. Thallapureddy Nadipi Subbi Reddy @ Chinna Subba Reddy & 5 Others. ...Defendants
4 మరియు 5వ ప్రతివాదులకు సమను
4. Thallapaureddy Surekha, D/o Late Sudhakar Reddy,
5. Thallapureddy Sunanda, D/o Late Sudhakar Reddy,
Both are residing at D.No.40/48, Muthurasipalli, Kadapa City, YSR (Dt). ...Defendant No. 4&5
పై దావాను భాగపరిష్కారం కోరకు మరియు Mesne Profits కొరకు వాది దాఖలు చేసి వున్నారు. అట్టి దావా యందు 4 మరియు 5వ ప్రతివాదులైన మీరు సమన్లు తీసుకొనకుండా ఉండుట వలన ఈ ప్రకటన ద్వారా తెలియజేయడం ఏమనగా మీరు పై తెలిపిన రాజశ్రీ కోర్టులో 28.01.2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు మీరు గానీ, మీ తరపున న్యాయవాది గారు గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు హాజరు కానంతట మీ పైన పరోక్షంగా తీర్మానించబడును.
వాయిదా తేది: 28.01.2025
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//
కె.వెంకట హరి
యం.వి.నరసయ్య
న్యాయవాదులు, ప్రొద్దుటూరు.
సెల్: 9440756088.